క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి



కొండలరావుపాలెంలో కొఠారు రామచంద్రరావుతో కట్టా ఏసుబాబు

దెందులూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. ఆయన్ని శనివారం పార్టీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో పరిస్థితులను రామచంద్రరావుకు వివరించారు. రామచంద్రరావు మాట్లాడుతూ పార్టీ నాయకులందరూ ఓర్పుతో ఉండాలని, జరుగుతున్న పరిణామాలను మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అధిష్టానానికి వివరించారని తెలిపారు.

జెడ్పీటీసీ జయలక్ష్మికి సత్కారం



జయలక్ష్మిని సత్కరిస్తున్న నాగరాజు

ఉంగుటూరు: జిల్లా జెడ్పీటీసీల చాంబర్ ఉపాధ్యక్షురాలిగా ఎంపికయిన స్థానిక జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మిని ఉంగుటూరు ఎంపీటీసీల చాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ల బీమాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసర్స్ శ్రీకర్‌బాబు

దెందులూరు: భారత తపాలాశాఖ అమలు చేస్తోన్న రూ.699లకే రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ వర్తించేలా యాక్సిడెంట్ల బీమాను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసర్స్ శ్రీకర్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పోస్టాఫీసులో ఆయన మాట్లాడుతూ యాక్సిడెంట్ల బీమా నిమిత్తం రూ.200తో ఖాతాను పోస్టాఫీసులో ఓపెన్ చేయాలన్నారు. యాక్సిడెంటల్ బీమాపై గ్రామ శివారు ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కలిస్తున్నామని తెలిపారు. దెందులూరు పోస్టు మాస్టర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



కలపర్రు టోల్ గేట్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నభి

పెదపాడు : ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పెదవేగి సీఐ నభి తెలిపారు. హెల్మెట్ ధారణపై పెదపాడు మండలంలోని కలపర్రు టోల్ గేట్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై శుభశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

గణపవరం తహసీల్దార్‌గా అప్పారావు



తహసీల్దార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

గణపవరం: స్థానిక తహసీల్దార్‌గా వైకేవీ అప్పారావు నియమితులయ్యారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. గతంలో ఉంగుటూరు, పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల్లో పనిచేశారు. అప్పారావును డీటీ సన్యాసిరావు, వీఆర్‌ఓల అసోసియేషన్ మండల అధ్యక్షుడు నిడమర్తి కేశవమూర్తి, రెవెన్యూ సిబ్బంది అభినందించారు. ఇప్పటివరకు గణపవరం తహసీల్దార్‌గా పనిచేసిన యడ్ల రాంబాబు కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు.

గ్రామాల్లో శ్రావణ శోభ

దెందులూరు: శ్రావణమాసం సందర్భంగా గ్రామగ్రామాన శ్రావణ శోభ సంతరించుకుంది. నూతన ప్రారంభోత్సవాలు, వివాహాలు, శంకుస్థాపనలతో పాటు అనేక శుభకార్యాలలో గ్రామాలు, ఆలయాలు, కార్యాలయాలు కళకళలాడుతున్నాయి.

ఎన్నో ఏళ్ల కల సాకారం

- వైఎస్సార్ సీపీ హయాంలోనే శ్రీపర్రు, బలివే వంతెనల నిర్మాణం
- భక్తులు, ప్రజలకు తొలగిన ప్రయాణ కష్టాలు



విజయరాయిలో నిర్మించిన వంతెన



విజయరాయిలో నిర్మించిన స్నాన ఘట్టం



శ్రీపర్రు వంతెన

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో ఏళ్ల నాటి వంతెనల సమస్యకు వైఎస్సార్ సీపీ హయాంలో పరిష్కారం లభించింది. పెదవేగి మండలంలో బలివేకు వంతెన, ఏలూరు రూరల్ మండలంలో శ్రీపర్రు వంతెనలను వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించారు. 2019 సంవత్సరానికి ముందు శివరాత్రికి బలివే వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడేవారు. తెల్లవారుజామున స్నానమాచరించడానికి భక్తులు ఇక్కట్లు పడేవారు. ఈ పరిస్థితిని గమనించిన నాటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.14 కోట్లు మంజూరు చేయించారు. పెదవేగి - ముసునూరు మండలాల్లో రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచి శైవక్షేత్రం బలివేకు వెళ్లడానికి విజయరాయి వద్ద ఎడమ, కుడివైపు స్నాన ఘట్టాలు నిర్మాంచారు. వంతెన నిర్మాణం పనులు 90 శాతం పూర్తిచేశారు. ప్రతి ఏటా శివరాత్రికి బలివేపుణ్య క్షేత్రానికి ఖమ్మం, ఏలూరు జిల్లా, ఇతర జిల్లాల నుంచి దాదాపు లక్ష మందికిపైగా భక్తులు ఈ పుణ్యక్షేత్రానికి వస్తారు. శివరాత్రి సమయంలో భక్తులకు, మిగిలిన రోజుల్లో పాఠశాలలు, పొలాలు, ఇతర పనులకు వెళ్లే ప్రజలు, విద్యార్థులకు ఈ వంతెన నిర్మాణం సౌకర్యవంతంగా మారింది. ఈ వంతెనకు సంబంధించిన మిగిలిన 10 శాతం పనులను కూడా ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

- ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు వద్ద ఏలూరు - కైకలూరు, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి వర్షాకాలంలోనూ వేలాది మంది ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవించే వారు. ఈ దుస్థితిని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.20 కోట్లతో శ్రీపర్రులో వంతెన నిర్మించారు. దశాబ్దాల కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న వంతెనల నిర్మాణం నాటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవతో సాకారమైంది.

శాశ్వత పరిష్కారం



రాష్ట్రంలో బలివే మహాశివరాత్రికి అత్యంత ప్రసిద్ధిగాంచింది. ప్రతిఏటా శివరాత్రి రోజున లక్షకుపైగా భక్తులు ఇక్కడకి వస్తుంటారు. విజయరాయి వద్ద వంతెన, రెండు వైపులా స్నానఘట్టాలు నిర్మించి మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించారు.

– తాతా రమ్యశ్రీ కుమార్, పెదవేగి ఎంపీపీ

కొల్లేరు ప్రజలకు మేలు



ఏలూరు మండలంతో పాటు 7, 8 మండలాలకు దశాబ్దాల కాలంగా శ్రీపర్రు వంతెన తీరని సమస్యగా ఉంది. ప్రతి ఏటా వర్షాకాలం, వరదలు వచ్చినప్పుడు రాకపోకలు ప్రశ్నార్థకంగా మారేవి. రైతులు, విద్యార్థులు, కూలీలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొల్లేరులో లక్షలాది మంది ప్రయాణికులు ఈ వంతెన నిర్మించడంతో మేలు చేశారు.

– తేరా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్

మోపెడ్‌ను ఢీకొన్న కారు



గాయపడిన వారిని ఏలూరు తరలిస్తున్న పోలీసులు

పెదపాడు : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయినట్లు పోలీసులు తెలిపారు. పెదపాడు మండలం కలపర్రు టోల్ గేట్ సమీపంలో టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న ఇద్దరు భార్యాభర్తలను వెనుక నుంచి కారు ఢీకొనడంతో వారి ఇరువురకు గాయాలయ్యాయి. వెంటనే హైవే పెట్రోలింగ్ పోలీసులు వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల వివరాలు తెలియాల్సి ఉంది.

హైవేపై ప్రమాద సూచికలు



హైవేపై ఆశ్రం - సోమవరప్పాడు మధ్య ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక

దెందులూరు: జాతీయ రహదారిపై సోమవరప్పాడు – ఆశ్రం మధ్య మలుపు రోడ్డులో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పోలీసు, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రెండు వైపులా ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇటీవల ఒక వ్యక్తి మృతి చెందిన సంగతి విదితమే.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



గాయాలతో పడి ఉన్న భార్యాభర్తలు



అంబులెన్స్‌లో మహిళకు వైద్య సేవలందిస్తున్న దృశ్యం

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు రైల్వే స్టేషన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. మోటార్ సైకిల్ అదుపు తప్పి పక్కనే ఉన్న ఇనుప రైలింగ్‌ను ఢీ కొట్టింది. చేబ్రోలుకు చెందిన ఎస్ అప్పలరాజు, లక్ష్మీకుమారి దంపతులను వైద్య చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్లితే.. చేబ్రోలుకు చెందిన భార్యాభర్తలిద్దరు తన మోటార్ సైకిల్‌పై ఏలూరుకు బయలుదేరారు. వారి వెంట గ్యాస్ సిలిండర్‌తో పాటు కొంత లగేజీ ఉంది. మార్గమధ్యమైన భీమడోలు రైల్వే స్టేషన్ ఎదురుగా వచ్చే సరికి సిలిండర్‌ను బ్యాలెన్స్ చేసుకోలేకపోవడంతో మోటార్ సైకిల్ అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న ఇనుప రైలింగ్‌ను ఢీకొట్టింది. రోడ్డు సెఫ్టీ మొబైల్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి అంబులెన్స్‌లో ప్రాథమిక వైద్య సేవలందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ఆటో బోల్తా



బోల్తాపడిన ఆటో

దెందులూరు: పెదవేగి మండలం రామచంద్రాపురం నుంచి వలసపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చింతలపూడి వెళ్తున్న పాసింజర్ ఆటో బోల్తా పడింది. పెదవేగి ఎస్సై రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి వెళ్తున్న కాపుదాసి రవికుమార్, కాపుదాసి భాస్కరరావు, కాట్రు మరియమ్మ, తాళ్లూరి కాంతమ్మ, బండి శైలజలకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



సంబరాలలో పాల్గొన్న సంఘనేతలు

గణపవరం: ఉపాధ్యాయ ఉద్యమాల్లో యూటీఎఫ్‌ది ప్రముఖ స్థానమని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేసి సమస్యలకు పరిష్కారం చూపిందని యూటీఎఫ్ జిల్లా నాయకుడు హోతా ఆంజనేయులు పేర్కొన్నారు. గణపవరం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా గణపవరం బాలికోన్నత పాఠశాలలో సంఘం పతాకావిష్కరించారు. స్వీట్లు పంచారు. నాయకులు కె.శర్మ, జె.నాని, బి.రమేష్, ఎం.వెంకటేశ్వర్లు, ఎండా శ్రీనివాస్, బీహెచ్ సీత, లక్ష్మణరాజు, భవానీ ప్రసాద్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం



భీమడోలులో బస్సుల్లో బ్యాగులను చెక్ చేస్తున్న సీఐ బీబీ రవికుమార్

భీమడోలు: కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ బీబీ రవికుమార్ హెచ్చరించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ప్రత్యేక బెటాలియన్‌తో సీఐ బీబీ రవికుమార్, ఎస్సై వై.సుధాకర్‌లు కలిసి జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. మత్తు పదార్థాలు అక్రమ రవాణాపై ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లోని లగేజ్ బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని ద్విచక్రవాహనచోదకులకు జరిమానా విధించారు. ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగం, కార్ డ్రైవర్లకు సీట్ బెల్ట్‌పై అవగాహన కల్పించారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో వాహనచోదకుని వద్ద సరైన ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలను అక్రమ రవాణ నేరమని హెచ్చరించారు. వాహనచోదకులు హెల్మెట్ వాడకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌లను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు చలపతిరావు, వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు కార్యదర్శుల బదిలీ

దెందులూరు: మండలంలో ఇద్దరు గ్రామ కార్యదర్శులు పదోన్నతిపై బదిలీ అయ్యారు. దెందులూరు గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి గ్రేడ్–2 కార్యదర్శిగా పదోన్నతిపై ముసునూరు మండలానికి బదిలీ అయ్యారు. సోమవరప్పాడు గ్రామ కార్యదర్శి ఎం శ్రీకాంత్ గ్రేడ్–2 కార్యదర్శిగా పదోన్నతి పొంది ముదినేపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఆ రెండు గ్రామాలకు కార్యదర్శులును నియమించాల్సి ఉంది.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిందని ఎస్సై మణికుమార్ తెలిపారు. 2021లో రూ.3,38,580 నగదును దొంగిలించగా.. కేసు నమోదైంది. ఈ కేసులో శుక్రవారం తాడేపల్లిగూడెం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్టు క్లాసు మెజిస్ట్రేట్ బి.అరుంధతి తీర్పునిచ్చారు.

విస్తృతంగా తనిఖీలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్ స్వయంగా త్రీటౌన్ పరిధిలో శనివారం రాత్రి త్రీటౌన్ సీఐ కె.శ్రీనివాసరావుతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసుల నమోదుతోపాటు భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మద్యం తాగి మోటారు సైకిళ్లు నడిపితే ఎదుటి వ్యక్తులకూ ప్రమాదం జరిగే అవకాశం ఉందని అన్నారు. మైనర్లకు మోటారు సైకిళ్లు ఇవ్వరాదనీ, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు.

- టూటౌన్ ప్రాంతంలో సీఐ ప్రభాకర్ విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ సర్కిల్ పరిధిలో వాహన తనిఖీలు చేశారు. ఏలూరు రూరల్ ప్రాంతంలో ఆశ్రం హాస్పిటల్, చొదిమెళ్ల వద్ద ఎస్సై రాజారెడ్డి వాహన తనిఖీలు చేశారు.

జాతీయ జెండాలతో ర్యాలీ



దెందులూరులో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

దెందులూరు: భారత జాతీయ జెండా ఔన్నత్యం, కీర్తిప్రతిష్టలు దశదిశలా వ్యాప్తి చేయాలని దెందులూరు డీఆర్‌డీ నర్సింగ్ కాలేజీ ఐదు వేల జాతీయ జెండాల పంపిణీని ప్రారంభించామని కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. శనివారం నర్సింగ్ కళాశాల విద్యార్థినులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఇంద్రవనం, రెండో వార్డుల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 9వ వార్డు సెంటర్‌లో సంబరాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థినులు ప్రయాణికులకు, ప్రజలకు ఆగస్టు 15వ తేదీ వరకు జాతీయ జెండాలను పంపిణీ చేస్తారని తెలిపారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం



భీమడోలు జంక్షన్‌లో స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్న ప్రజలు

భీమడోలు: కేరళ వరద బాధితులకు మానవతావాదులంతా అండగా నిలిచి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. భీమడోలు జంక్షన్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. దుకాణ దారులు, ప్రజలు విరాళాలు అందించి తమ ఔదార్యాన్ని చాటారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియాలు విరిగిపడిన దుర్ఘటనలో 400 మంది మృతి చెందగా, వందలాది మంది ఆసుపత్రుల పాలయ్యారని, ఎందరో జాడ కానరావడం లేదని శ్రీనివాస్ తెలిపారు. నష్టపోయిన ప్రజలకు మనమంతా అండగా ఉండాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించి పూర్తిస్థాయి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రానికి సంఘీభావంగా ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, నాయకులు కొర్ని అప్పారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బలివేకు వెళ్లే వంతెన పరిశీలన



విజయరాయి వద్ద మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

దెందులూరు: రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన బలివే పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు, పాదచారులకు రాకపోకలకు అసౌకర్యం కలగకుండా తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి కొలుసు పార్థసారధి ఎస్ఈ జయప్రకాషను ఆదేశించారు. శనివారం పెదవేగి మండలం విజయరాయి వద్ద బలివేకు వెళ్లే వంతెన నిర్మాణాన్ని, రెండు స్నాన ఘట్టాలను ఆయన పరిశీలించారు. మిగిలిన ఉన్న నిర్మాణ ప్రాంతంలో త్వరితగతిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రాకపోకలకు సాగేంచేలా చూడాలని అన్నారు. రేవు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అడుగంటిన చెరువులు



నీరు లేక వెలవెలబోతున్న దొండపాడు చెరువు



పడమట లాకుల నుంచి వృథాగా పోతున్న తమ్మిలేరు వరద నీరు

- ఆందోళనలో చొదిమెళ్ల రైతులు
- వృథాగా పోతున్న తమ్మిలేరు నీరు
- స్పందించని అధికారులు

ఏలూరు రూరల్ : చొదిమెళ్ల గ్రామం పక్క నుంచే ప్రవహిస్తున్న తమ్మిలేరులోని వేలాది క్యూసెక్కుల వరదనీరు వృథాగా పోతోంది. మరోవైపు కూతవేటు దూరంలో విశాలమైన దొండపాడు, రాయుడు సాగునీటి చెరువులు ఎండిపోయాయి. ఈ పరిస్థితులు రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయి. కళ్ల ముందే పారుతున్న వరదనీరు పంటచేలకు చేరడం లేదని వారు వాపోతున్నారు. దొండపాడు, రాయుడు చెరువులకు వరదనీరు మళ్లించాలన్న ఆలోచన ఇరిగేషన్ అధికారులు, పాలకులకు కలగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల్లో పంట కాలువ

సుమారు 100 ఏళ్ల క్రితం తవ్విన దొండపాడు, రాయుడు చెరువులకు వరద, వర్షపు నీరు మళ్లించేలా నాటి పాలకులు స్లూయిజ్, కల్వర్టులు, పంట కాలువ తవ్వించారు. కొంతకాలంగా చెరువులకు చుట్టుపక్కల వెలస్తున్న లేఅవుట్ల కారణంగా పంట కాలువ ఆక్రమణకు గురై కుచించుకుపోయాయి. మురుగునీరు పారే బోదెలు సైతం కనుమరుగయ్యాయి. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు నిండడం లేదు. వేసవికాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మురుగు నీరు కిందకు పారక చేలు మునిగిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం కూలీలతో పూడిక పనులు చేపట్టారు. చొదిమెళ్ల ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైనందున ఇప్పుడు ఆ పనులు చేపట్టడం లేదు. మరోపక్క ఇరిగేషన్ అధికారులు చెరువులు నింపే పనులు గాలికి వదిలేశారు. ఫలితంగా వందలాది ఎకరాల సాగు భూములకు నీరు అందడం లేదు. ఇప్పటికే చొదిమెళ్ల రైతులు వర్షపునీటితో చెరువు కింద వందలాది ఎకరాల్లో నాట్లు వేశారు. మరో రెండు నెలల పాటు సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంటుంది. పలువురు రైతులు భూస్వాముల నుంచి బోరు నీరు కొనుక్కొని పంటను కాపాడుకుంటున్నారు. డబ్బు లేని పేద రైతులు లబోదిబో అంటారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు యడ్లపల్లి శివ, యడ్లపల్లి మహేశ్వరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు, వాడపల్లి రంగారావు తదితరులు ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.

చొదిమెళ్లలో సిరుల సాగు

పూర్వీకులు కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న చొదిమెళ్ల రైతులు సిరులు పండిస్తున్నారు. సుమారు 50 ఎకరాలు విస్తీర్ణం గల దొండుపాడు చెరువు ఖరీఫ్ సమయంలో నీటితో కళకళలాడేది. ఈ నీటిని ఉపయోగించుకుని రైతులు దీనికి దిగువన ఉన్న సుమారు 200 ఎకరాల్లో వరి పండించేవారు. ఎకరానికి 40 నుంచి 45 బస్తాలు దిగుబడి సాధించేవారు. వేసవికాలంలో ఈ చెరువులో కూరగాయలు, ఆకు కూరలతో పాటు ఆరుతడి పంటలు, మొక్కజొన్న పండించి లాభాలు గడించారు. ఇదే క్రమంలో సుమారు 40 ఎకరాల విస్తీర్ణం రాయుడు చెరువులోకి సైతం వరదనీరు పారేది. ఈ చెరువు నీరు సద్వినియోగం చేసుకుని సుమారు 200 ఎకరాల్లో రైతులు సిరులు పండించేవారు.